ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కరీంనగర్
1
జిల్లా వార్తలు
ఆదివారం 20 ఏప్రిల్ 2025



కార్మికులు ఈ శ్రమ్ పోర్టల్‌లో
పేర్లు నమోదు చేసుకోవాలి

భగత్‌నగర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): కార్మికులు ఈ శ్రమ్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ ఎస్ వెంకట రమణ ఒక ప్రకటనలో తెలిపారు. భారత ప్రభుత్వ కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేసే గిగ్, ప్లాట్‌ఫాం కార్మికులను కలుపుకుని సామాజిక భద్రత విస్తరించనున్నట్లు తెలిపారు. 2025-2026 సంవత్సరానికి సంబంధించి ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజనను విస్తరించనున్నట్లు తెలిపారు. కేంద్ర కార్మిక, ఉపాధి శాఖలు అందిస్తున్న ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

భూ భారతితో సమస్యల పరిష్కారం

కలెక్టర్ పమేలా సత్పతి



హుజూరాబాద్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

హుజూరాబాద్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన భూ భారతితో రైతుల భూ సమస్యలు పరిష్కారం అవుతాయని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. శనివారం హుజూరాబాద్‌లో భూ భారతి చట్టం- 2025పై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల భూములపై భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. ధరణి పోర్టల్‌లో లేని అనేక సమస్యలు భూ భారతితో పరిష్కారమవుతాయన్నారు.

రాష్ట్రంలోని నాలుగు మండలాల్లో పైలట్ ప్రాజెక్టు కింద ఈ చట్టం అమలు చేస్తున్నారని తెలిపారు. ధరణి వ్యవస్థ ఉన్నప్పుడు ఏదైనా అభ్యంతరం ఉంటే సివిల్ కోర్టుకు మాత్రమే వెళ్లాల్సి వచ్చేందన్నారు. భూ సమస్యలు పరిష్కరిస్తూ అధికారులు జారీ చేసిన ఉత్తర్వులపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే భూ భారతి చట్టాల ప్రకారం అప్పీలు చేసుకునే అవకాశం ఉందన్నారు. గతంలో తహసీల్దార్ పరిష్కరించే చిన్న చిన్న సమస్యలు కూడా కలెక్టర్ దగ్గరికి వచ్చేవని, వేల సంఖ్యలో దరఖాస్తులు రావడం వల్ల పరిష్కరించడంలో జాప్యం జరిగేదన్నారు. భూ భారతి ద్వారా కింది స్థాయి అధికారులకు బాధ్యతలు అప్పగించారన్నారు. ధరణిలో భూ సమస్యల దరఖాస్తులు చేసుకునేందుకు 33 మాడ్యుల్స్ పొందు పరిచారని, దీని ద్వారా ఏ సమస్యకు ఏ మాడ్యుల్‌లో దరఖాస్తు చేయాలో అర్థం కాకుండా ఉండేదన్నారు.

భూ భారతిలో నాలుగు మాడ్యుల్స్ మాత్రమే ఉన్నాయని, రైతులు సులభంగా దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. భూ భారతి చట్టం ద్వారా రైతులకు, పేదలకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీ కిరణ్, ఆర్డీవో రమేష్‌బాబు, తహసీల్దార్ కనకయ్య, వివిధ శాఖాధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గన్నేరువరంలో పీహెచ్‌సీ పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

గన్నేరువరం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంగా ఏర్పడి తర్వాత ఎనిమిది సంవత్సరాలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి శనివారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ శ్రీకారం చుట్టారు. గన్నేరువరం శివారులోని ఖాసింపేట, మైలారం, మాదాపూర్ గ్రామాలకు వెళ్లే ప్రధాన చౌరస్తా వద్ద సేకరించిన ప్రభుత్వ స్థలంలో పీహెచ్‌సీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే శనివారం శంకుస్థాపన చేశారు. మండలంలోని వివిధ గ్రామాల ప్రజలకు ఈ స్థలం అనువుగా ఉండడంతో పాటు ప్రధాన మార్గం కావడంతో అధికారులు పీహెస్‌సీకి స్థలాన్ని కేటాయించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దారు ఇప్ప నరేందర్, ఏఈపీఆర్ స్నేహజ్యోతి, ఆర్‌ఐ రజనీకాంత్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

- నిలిచిపోయిన ముఖ్యమంత్రి హామీ పనులు
- అసంపూర్తి రోడ్లతో ప్రజలకు ఇబ్బందులు
- పెండింగ్‌లో రూ. 132 కోట్ల పనులు
- మంత్రి పొన్నం వైపే అందరి చూపు

తవ్వి..వదిలేశారు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

ఉత్తర తెలంగాణలో కరీంనగర్‌ను స్మార్ట్ సిటీగా అభివృద్ధి పరచడమే కాకుండా పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని ప్రభుత్వం, అధికార పార్టీ నేతలు చెబుతున్నారు. ముఖ్యమంత్రి హామీ పద్దు కింద చేపట్టిన పనులకే మోక్షం లేకుండా పోయి వెక్కిరిస్తున్నాయి. ఏ పార్టీ అధికారంలో ఉన్నా ముఖ్యమంత్రి హామీలను అమలు చేసేందుకు రాష్ట్రస్థాయిలో, జిల్లా స్థాయిలో కమిటీలు ఉంటాయి. ముఖ్యమంత్రి హామీ మేరకు చేపట్టిన పనులు ముఖ్యమంత్రి హామీ పద్దు కింద విడుదలైన నిధులతో చేపట్టిన పనులు ఏ దశలో ఉన్నాయి, ఎప్పటికి పూర్తవుతాయి, అవి పూర్తి కావడానికి ఏం చర్యలు తీసుకుంటున్నారు, ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ముఖ్యమంత్రి కార్యాలయానికి నివేదికలు పంపిస్తుంటారు. ఆనవాయితీ ఇలా ఉన్నా కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో చేపట్టిన సీఎం అస్యూరెన్స్ పనులు మధ్యలో ఆగిపోతే పట్టించుకునే వారే లేకుండా పోయారు.



ముకరంపురలోని ఓ వీధిలో తవ్విన రోడ్డు

హడావుడిగా పనులు ప్రారంభం

బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడుఆనాటి జిల్లా మంత్రి గంగుల కమలాకర్ 132.94 కోట్ల రూపాయల అంచనాలతో సీఎం అస్యూరెన్స్ పద్దు కింద 80 అంతర్గత రోడ్ల అభివృద్ధి పనులు మంజూరు చేయించారు. టెండర్ ప్రక్రియను పూర్తి చేసి శ్రీ రాజరాజేశ్వర కన్‌స్ట్ర క్షన్స్ అనే సంస్థకు పనులు అప్పగించారు. ఎన్నికల నాటికి రోడ్ల ను అభివృద్ధి చేసేందుకు హడావుడిగా పనులు చేపట్టి పలు రోడ్లను తవ్వేశారు. ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ పరాజయం పాలై, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి కొత్త ప్రభుత్వం ఏర్పడింది. ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు గడిచినా తవ్విన రోడ్లు తవ్వినట్లుగానే ఉన్నాయి. ఎక్కడి పనులు అక్కడ నిలిచి పోవడంతో ప్రజలు నడవలేక, వాహనాల్లో ఆ రోడ్లపై ప్రయాణించలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. ఒకేసారి అన్ని రోడ్లను తవ్విన ఆనాటి ప్రభుత్వాన్ని, ఆరోడ్లను అసలే పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తిడుతూ, విమర్శిస్తూ పనులు ఎప్పటికి పూర్తవుతాయోనని ప్రజలు ఎదురు చూస్తున్నారు.



గుంతల రోడ్డుతో ఇబ్బంది పడుతున్న వాహనదారులు

ముందుకు కదలని పనులు

132.94 కోట్ల అంచాన వ్యయంతో 80 అంతర్గత రోడ్లలో వాటి అభివృద్ధి వైడనింగ్, మరమ్మతులు, సీసీ వేయడం పైపులైన్లు వేయడం ఉపరితల డ్రైనేజీల నిర్మాణం తదితర పనులను చేపట్టారు. వీటిలో ప్రస్తుతం 59 పనులు ప్రగతిలో ఉన్నాయని, రెండు పనులు పూర్తయ్యాయని మరో 19 పనులు ప్రారంభించాల్సి ఉందని ఇంజనీరింగ్ విభాగం చెబుతున్నది. పనులు చేపట్టిన ఎస్ఆర్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ 60 కోట్ల రూపాయల పనులు పూర్తి చేసినట్లు ఎంబీ రికార్డు చేసి బిల్లులు సమర్పించింది.

మున్సిపల్ కార్పోరేషన్ 32 కోట్ల చెల్లింపులకు చెక్కు ఇచ్చినా కుబేరాలో ఆ చెక్కుకు క్లియరెన్స్ ఇవ్వలేదు. దీంతో పనులు చేపట్టిన కాంట్రాక్టర్ ఎక్కడి పనులు అక్కడ నిలిపి వేశాడు. ఒక్క ఏజెన్సీకే పనులు అప్పగించడంతో కార్పొరేషన్ పరిధిలో చేపట్టిన అన్ని రోడ్ల నిర్మాణ పనులు ఆగిపోయి 14 నెలలుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అంతర్గత రోడ్లు తవ్వి వదిలేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గ పరిధిలో ఎమ్మెల్యే బిఆర్‌ఎస్ పార్టీకి, ఎంపీ బీజేపీకి చెందిన వారు కావడంతో ప్రజలు వెళ్లి రోడ్ల పరిస్థితి చెప్పినా వారు అధికార పార్టీ వైపు వేలు చూపిస్తున్నారని అంటున్నారు.

మంత్రులు దృష్టి సారిస్తేనే..

ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జిల్లాకు చెందిన మంత్రి పొన్నం ప్రభాకర్ కార్పొరేషన్‌లో ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి నిలిచి పోయిన ఈ అంతర్గత రోడ్ల అభివృద్ధి పనుల విషయం పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. మంత్రి పొన్నం ప్రభాకర్ తన నియోజక వర్గమైన హుస్నాబాద్‌పై చూపిస్తున్న శ్రద్ధలో పది శాతం కరీంనగర్ నియోజక వర్గంపై పెట్టినా

మిగతా 4వపేజీలో

బాల పురస్కార్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

గణేష్‌నగర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 2025-26 సంవత్సరంలో ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డు-2025 (పీఎంఆర్‌బీపీ) కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా సంక్షేమాధికారి కె సబిత ఒక ప్రటకలో తెలిపారు. 5 నుంచి 18 సంవత్సరాలలోపు బాలలు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆవిష్కరణ, సృజనాత్మకత, మంచి అభ్యాస వాతావరణం, సాంస్కృతిక, కళలు, సాహసం, క్రీడలు, సామాజిక సేవ, శాస్త్ర సాంకేతిక, ఇతర రంగాల్లో ప్రతిభ చూపిన బాలలు జూలై 31లోపు https://awards.gov.in వెబ్‌సైట్‌లో దర ఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు https://awards.gov.in వెబ్‌సైట్ లేదా జిల్లా పరిషత్‌లోని బాల రక్ష భవన కార్యాల యంలోని డీసీపీయూ విభాగం 7396424387 నంబర్‌లో సంప్రదించాల్సిగా సూచించార

కంప్యూటర్, బ్యూటీషియన్ కోర్సులు ప్రారంభం

గణేశ్‌నగర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రాంనగర్‌లోని వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో కంప్యూటర్, బ్యూటీషియన్ కోర్సులు ప్రారంభం అవుతున్నట్లు జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారి శ్రీనివాస్ తెలిపారు. ఆసక్తి గల యువతీ యువకులు రాంనగర్‌లోని వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5గంటల వరకు సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఏడో తరగతి ఆ పై చదివి, 18 సంవత్సరాలు నిండిన వారు అర్హులు అని తెలియజేశారు. ఈ శిక్షణ మూడు నెలలు ఉంటుందని, కోర్సు పూర్తయ్యాక సర్టిఫికెట్ ఇస్తారని చెప్పారు. కంప్యూటర్ (ఎంఎస్ ఆఫీస్) కోర్సు ఫీజు వెయ్యి రూపాయలు, బ్యూటీషియన్ కోర్సు ఫీజు 1,500 రూపాయలు ఉంటుందని తెలిపారు. వివరాలకు 9640967943, 9949850360 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

క్షమాగుణంతో ప్రగతి

రన్ ఫర్ జీసస్ ర్యాలీలో మానకొండూరు ఎమ్మెల్యే 'కవ్వంపల్లి'





రన్ ఫర్ జీసస్ ర్యాలీ ప్రారంభిస్తున్న మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపెల్లి సత్యనారాయణ, ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులు

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 19 (ఆంధ్ర జ్యోతి):అన్ని రంగాల్లో ప్రగతి సాధిం చాలం టే క్షమాగుణం ముఖ్యమని మానకొండూ రు ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శనివారం కరీంనగర్ కోర్టు చౌరస్తాలో క్రైస్తవ సంఘా ల ఆధ్వర్యంలో నిర్వహించిన రన్ ఫర్ జీసస్ ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ప్రపంచ శాంతి కోసం క్రీస్తు తన ప్రాణాన్ని అర్పించి క్షమాపణ ద్వారా ఒక నూతన శకాన్ని ఆరంభించారని అన్నారు. అశాంతి వల్ల ప్రగతికి విఘాతం కలుగు తుందని అన్నారు. కో ఆర్డినేటర్ తిమోతి జయరాజ్ మాట్లాడుతూ దేశ శాంతి, ఐక్యత కోసం ప్రతీ యేటా రన్ ఫర్ జీసస్ కార్యక్ర మాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ర్యాలీ కోర్టు చౌరస్తా నుంచి ప్రారంభమై పుర వీధుల గుండా సాగుతూ సీఎస్ఐ వెస్లీ కేథడ్రల్ చర్చ్ వద్ద ముగిసింది. కార్యక్ర మంలో పాస్టరేట్ చైర్మన్లు పాల్ కొమ్మాలు, ఎస్ జాన్, పింటూ, రెడ్డి మల్ల ప్రసాద్, ప్రశాంత్, సురేశ్, గిదియోను, ఎలీషా, సంపత్ పా ల్, డేవిడ్‌రాజ్, చంద్రమోహన్, కృష్ణసాగర్, జి కృపాదానం పాల్గొన్నారు

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

చిగురుమామిడి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. మండలంలోని రేకొండ, ఓగులాపూర్, రామంచ, మూదిమాణిక్యం, సుందరగిరి, ముల్కనూర్ గ్రామాల్లో మహాసభలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల, కర్షకుల హక్కుల కోసం ఉద్యమాలు నిర్వహించిన చరిత్ర తమ పార్టీకి ఉందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈసారి సత్తా చాటాలన్నారు. ఆయా గ్రామాల్లో సీపీఐ గ్రామ శాఖ కార్యదర్శులను ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఓగులాపూర్‌లో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న చాడ వెంకటరెడ్డి, సీపీఐ నాయకులు

అలరించిన మాక్‌డ్రిల్



కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): అగ్నిమాపకశాఖ వారోత్సవాల్లో భాగంగా జిల్లా ఫైర్ ఆఫీసర్ ఎం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఫైర్ సిబ్బంది ఇందిరాచౌక్‌లో శనివారం మాక్‌డ్రిల్‌ను నిర్వహించారు. ఎత్తైన భవనాలు, అపార్ట్ మెంట్లలో అగ్నిప్రమాదాలు సంభవించిన సమయంలో మంటలను ఆర్పివేయడం, ప్రజలను, ఆస్తులను అగ్నిప్రమాదలబారి నుంచి రక్షించేందుకు తీసుకునే చర్యలపై ఐదు ఫైరింజన్లతో ప్రదర్శన నిర్వహించారు. వంట గ్యాస్‌తో ఎలాంటి ప్రమాదాలు జరుగుతాయి.. గ్యాస్ లీకేజి అయిన సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. మంటలు అంటుకున్న సందర్భంలో చేపట్టే రక్షణ చర్యలు, అగ్నిప్రమాదాలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ముద్రించిన కరపత్రాలు ప్రజలకు పంపిణీ చేవారు. అనంతరం వాల్‌పోస్టర్లను అతికించారు. కార్యక్రమంలో కరీంనగర్, చొప్పదండి, మానకొండూర్ ఫైర్ ఆఫీసర్లు రాజ్‌కుమార్, పవన్, బూదయ్యతోపాటు అగ్నిమాపకశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



తెలంగాణచౌక్‌లో ప్రదర్శన నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది



ఆంధ్రజ్యోతి CLASSIFIEDS

CHANGE OF NAME

★ I DASARI SATHYAM S/O DASARI CHINNA RAJANNA R/O. H.NO.1-102, ERDANDI VILLAGE METPALLY MANDAL, JAGITHYAL DIST. NOW I CHANGED MY NAME AS DASARI SATYAREDDY S/O. DASARI CHINNA RAJANNA

AJK-16715

3+2 స్కీం కలదు

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధంలేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా / ఇతరత్రా నమ్మించబడిన / క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.

పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనలకై సంప్రదించండి
కరీంనగర్ :- సెల్ : 9703618691, 99854 10640
జగిత్యాల, మెట్‌పల్లి :- సెల్ : 99854 11262
వేములవాడ, సిరిసిల్ల :- సెల్: 99854 11063
పెద్దపల్లి :- 95509 00238

జేఈఈ ఫలితాల్లో 'అల్ఫోర్స్'కు ర్యాంకుల పంట



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ఐఐటీ జేఈఈ(మెయిన్స్) 2025 ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యార్థులు వివిధ కేటగిరీల్లో జాతీయస్థాయి అత్యుత్తమ ర్యాంకులు సాధించారని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి నరేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం కరీంనగర్ లోని అల్ఫోర్స్ కళాశాలలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్.శరణ్య 49వ ర్యాంకుతో అత్యుత్తమ స్థానంలో నిలువగా, పి శ్రీహర్ష 244 ర్యాంకు, ఎన్ అనిరుద్‌సాయి 272, డి విశాల్ 329, జె వామిక 350, టి ప్రణతి 456, ఇ అంకిత్‌సాయి 574, బి ఆదిత్య 630, టి షివాత్మిక 646, వి హృషికేష్ 703, మహ్మద్ అబ్దుల్ 968, పవార్బాల్, ఆర్ సుమిత్‌కుమార్, డి కార్తీక్‌రెడ్డి, మహ్మద్బుల్షన్, బి విష్ణు ర్యాంకులు సాధించి అల్ఫోర్స్ కీర్తిని ఇనుమడింపచేశారన్నారు. రానున్న అడ్వాన్స్‌డ్ పరీక్షకు అర్హత సాధించిన విద్యార్థులకు అత్యుత్తమ అధ్యాపక బృందంతో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఐఐటీ, నీట్‌లో అల్ఫోర్స్ విద్యార్థులు రాణించడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు ఘనవిజయం సాధించినందుకు అధ్యాపక, అధ్యాపకేతర బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీచైతన్య విద్యార్థుల ప్రభంజనం

సుభాష్‌నగర్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యాసంస్థలు జాతీయ స్థాయిలో ప్రభంజనం సృష్టించాయని చైర్మన్ రమేశ్‌రెడ్డి తెలిపారు. విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులను సాధించారన్నారు. ఎం రోహిత్ 17, టి కుందన్ 814, పి ఈశ్వర్‌ముఖేష్, ఎం అంజలి 2575, బి.అక్షర 2992, ఎం.తరుణ్ 5949, జి.నందిని 7464 ర్యాంకుతోపాటు 20వేల లోపు 15 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. జేఈఈ మెయిన్స్‌కు హాజరైనవారిలో 40 శాతం మంది విద్యార్థులు అడ్వాన్స్‌కు అర్హత సాధించినట్లు చెప్పారు. అనునిత్యం పర్యవేక్షణ, విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం నిండంతో ఇంతటి ఘనవిజయం సాధించామన్నారు. సంస్థ స్థాపించిన నాటి నుంచి అన్ని పోటీ పరీక్షల్లో తమ విద్యార్థులు రాణిస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపక బృందానికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ కర్ర నరేందర్‌రెడ్డి, డీన్ జగన్‌మోహన్‌రెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌లు మల్లారెడ్డి, రాధాకృష్ణ, మోహన్‌రావు, ఏజీఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



విజయకేతనం చూపిస్తున్న శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ రమేశ్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు

ట్రినిటి కళాశాల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ట్రినిటి విద్యా సంస్థల వ్యవస్థాపక చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి

సుభాష్‌నగర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ట్రినిటీ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఎ రఘుపతి అనే విద్యార్థి జాతీయస్థాయిలో 138వ ర్యాంకు, ఎ హేమంత్ 132, డి సాయిసరణ్‌కుమార్ 313, ఎస్ పరమేశ్వర్‌రెడ్డి 344, ఎ ఫణీందర్ 409, ఆర్ సాయికిషోర్ 587, వి అదీప్ 751, డి మహేశ్ 974, ఆర్ మనోజ్ 1262, బి సిద్ధిక 1551 ర్యాంకు సాధించారు. కేవలం ఒకే బ్రాంచి నుంచి 1000లోపు ఎనిమిది ర్యాంకులతో పాటు పరీక్షకు హాజరైన విద్యార్థుల్లో 83 శాతం మంది విద్యార్థులు జేఈఈ-అడ్వాన్స్ పరీక్షలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా శనివారం కళాశాల ఫౌండర్ చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి విద్యార్థులు, అధ్యాపకులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిష్ణాతులైన అధ్యాపకుల పర్యవేక్షణలో, నిర్దిష్టమైన ప్రణాళిక, ఉన్నతమైన విద్యా బోధనతో ర్యాంకులు సాధించినట్లు చెప్పారు. అనంతరం చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఉత్తమ ర్యాంకులు సాధించడం ట్రినిటి కళాశాలకే సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఆయా బ్రాంచీల ప్రిన్సిపాల్‌లు, అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మానకొండూర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామానికి చెందిన మడ్డి తిరుపతి (50) అనే వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. తిరుపతి తన దాబా ఇంటిపై మరో మరో రెండు రూములను నిర్మించేందుకు ఇటుకల గోడను నిర్మిస్తున్నారు. ఈ 12న పనులను పరిశీలించేందుకు ఇంటిపైకి వెళ్లాడు. నూతనంగా నిర్మిస్తున్న గోడను పట్టుకోవడంతో గోడకూలీ కిందపడ్డాడు. తీవ్ర గాయాల పాలైన తిరుపతిని చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య వనజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మోసం చేసిన వ్యక్తి అరెస్టు

ఇల్లంతకుంట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : సబ్సిడీ రుణం ఇప్పిస్తానని మోసం చేసిన పెద్దలింగాపూర్ గ్రామానికి చెందిన అమ్ముల అశోక్‌యాదవ్‌ను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. వల్లంపట్ల గ్రామానికి చెందిన పెంటల మల్లయ్య వద్దకు వెళ్లి ఎస్సీ పేరు మీదు ట్రాక్టర్ కొనుగోలు చేస్తే ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ ఇప్పిస్తానని నమ్మించి రూ.50వేలు తీసుకున్నాడు. కొద్దిరోజులకు సబ్సిడీ మంజూరు అయినట్లు నకిలీ ప్రొసీడింగ్ కాపీ అందించాడు. వంతడుపుల గ్రామానికి చెందిన బోయిని పర్శరాంకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణం ఇప్పిస్తానని చెప్పి రూ.50వేలు తీసుకొని నకిలీ ప్రొసీడింగ్ కాపీ అందించాడు. పర్శరాం దీనిని తీసుకొని కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి అడగగా నకిలీదని తేలింది. దీనితో బాధితులు ఫిర్యాదు చేయగా శనివారం అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పచ్చదనానికి గొడ్డలిపెట్టు

యథేచ్ఛగా హరితహారం చెట్ల నరికివేత

రహదారి వెంట వృక్షాలకు రక్షణ కరువు

చందుర్తి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా ఏటా వానాకాలంలో ప్రజలందరినీ భాగస్వాములను చేస్తూ ప్రభుత్వ, ప్రైవేటు ఖాళీ స్థలాలతో పాటు, ఇళ్లు, పొలాలు, చెరువులు గట్లపై ప్రతిష్ఠాత్మకంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు అట్టహాసంగా చేపడుతున్నారు. అవి పెరిగి పెద్దవి కాగానే విద్యుత్ తీగలకు అడ్డువస్తున్నాయని విద్యుత్ శాఖ అధికారులు సిబ్బంది ఏపుగా పెరిగిన చెట్లను నరికేస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. చందుర్తి మండలంలోని మూడపల్లి, మర్రిగడ్డ, లింగంపేట, మల్యాల తదితర గ్రామాల్లో పదేళ్లగా నాటిన మొక్కలు పెరిగి పెద్దవి కాగా విద్యుత్ అధికారులు తీగలకు అడ్డువస్తున్నాయని, రైతులు తమ పంట పొలాలపై చెట్ల నీడతో పంటలు పండవని చెట్లను మొదళ్ల నుంచి నరికేస్తున్నారు. గతంలో రోడ్లకిరువైపులా ఉపాధిహామీ, అటవీ శాఖ అధికారులు, గ్రామపంచాయతీలను భాగస్వామ్యం చేస్తూ పెద్దఎత్తున మొక్కలను నాటించారు. ఒక్కొక్క గ్రామాల్లో వేలాది మొక్కలు నాటారు. వాటిలో దాదాపు 80 శాతం మేర ఏపుగా పెరిగాయి. ప్రధాన రోడ్లకిరువైపులా ఇప్పటికే పలుమార్లు చెట్లను నరికేశారు. అయినా అవి పెరుగుతుంటే అధికారులు విద్యుత్ తీగలకు అడ్డువచ్చే చెట్ల కొమ్మలతో పాటు ఇతర చెట్లను సైతం నరికేస్తున్నారు. పలుచోట్ల మొదళ్ల వరకు నరికేసి చేతులు దులుపుకుంటున్నారు.



మూడపల్లిలో బైపాస్ రోడ్డులో నరికిన చెట్టు

కన్నెత్తి చూడని అధికారులు

గ్రామపంచాయతీల్లో కొన్ని సంవత్సరాల నుంచి పెంచిన హరితహారం చెట్లను యథేచ్ఛగా నరికేస్తున్నా సంబంధిత అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడటం లేదు. చెట్లు తిరిగి చిగురించేందుకు వీలు లేకుండా మొదళ్ల వరుకు నరికేస్తున్నారు. తీగలకు తగిలే కొమ్మలను తొలగించకుండా మొత్తం చెట్లను నరికి వేస్తుస్తుంటే అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టించుకోని అటవీ శాఖ అధికారులు పెద్దఎత్తున రోడ్లకిరువైపుల చెట్లు నరికివేతకు గురవుతున్నప్పటికీ ఉపాధిహామీ అధికారులు కానీ, అటు అటవీ శాఖ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. సొంత ప్లాట్లలో పెరిగిన చెట్లను తొలగించడానికి అనుమతుల పేరుతో ఇబ్బందులకు గురిచేసే అధికారులు ఎంతో ప్రజాధనం వెచ్చించి హరితహారంలో భాగంగా పెంచిన చెట్లను ఎలాంటి అనుమతులు లేకుండా నరికేస్తున్నా కనీస చర్యలు చేపట్టడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి చెట్లు నరికివేతకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



మూడపల్లి శివారులో నరికిన హరితహారం చెట్లు

చెట్లను నరికివేస్తే చర్యలు తీసుకుంటాం..

రాజయ్య, చందుర్తి ఏపీవో



హరితహారంలో భాగంగా రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలను తొలగించినా, చెట్లను నరికివేసినా చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. జరిమానాతోపాటు కేసులు కూడా నమోదు చేయిస్తాం. మొక్కలు, చెట్లను నరికి వేయడం, తగలబెట్టడం లాంటి పనులు చేయవద్దు.

జేఈఈ ఫలితాల్లో
'ఎస్ఆర్' విద్యార్థుల జయకేతనం



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఆర్ కళాశాలల జోనల్ ఇన్‌చార్జి నేదురు తిరుపతి

తిమ్మాపూర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్‌లో ఎస్ఆర్ కళాశాలకు చెందిన విద్యార్థులు జయకేతనం ఎగుర వేసినట్లు కళాశాలల జోనల్ ఇన్‌చార్జి నేదురు తిరుపతి తెలిపారు. మండలంలోని అలుగునూర్‌లోగల ఎస్ఆర్ కళాశాల ఆవరణలో శనివారం మీడియా సమావేశంలో మాట్లా డారు. జేఈఈ మెయిన్స్‌లో తమ కళాశాలకు చెందిన 12 మంది విద్యార్థులు అర్హత సాధిం చారని తెలిపారు. ఎస్ఆర్ కళాశాలకు చెందిన దాదాపు 185 మందికి పైగా విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌లో విజయం సాధించినట్లు తెలిపారు. వై భరణి శంకర్ జాతీయ స్థాయి లో 88వ ర్యాంకు సాధించగా, బి సురేష్ 98వ ర్యాంకు, ఎ కార్తిక్ 584వ ర్యాంకు, లకావత్ మాధవ్‌చరణ్ 707వ ర్యాంకు, లునావత్ రామ్ చరణ్ 777వ ర్యాంకు, పత్తెం హృషికేష్ 796వ ర్యాంకు సాధించారని వివరించారు. వారితో పాటు మరో ఏడుగురు విద్యార్థులు ఆరువేల లోపు ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. విద్యాసంస్థల అధినేత వరదారెడ్డి, డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, కరీంనగర్ డీజీఎం వాసుదేవరెడ్డి, జోనల్ ఇన్‌చార్జి నేదురు తిరుప తిరెడ్డి, ప్రిన్సిపాల్స్‌ను అభినందించారు.

జమ్మికుంట సప్తగిరి ఆసుపత్రి పర్మిషన్ రద్దు

- సీజ్ చేస్తున్నట్లు వైద్యశాఖ నోటీసులు

జమ్మికుంట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని పాత అంబేద్కర్ చౌరస్తాలో గల సప్తగిరి ఆసుపత్రిలో సీఎంఆర్ఎఫ్ బిల్లుల్లో అక్రమాలు జరిగాయని సీఐడి అధికారులు నిగ్గు తేల్చారు. దీంతో ఆసుపత్రి అనుమతి రద్దు చేసి, సీజ్ చేస్తున్నట్లు వైద్యారోగ్య శాఖ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. అయిన కూడా ఆసుపత్రి నడిపిస్తున్నారని ఫిర్యాదులు అందడంతో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు శనివారం ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఆసుపత్రి షెటర్ ఎందుకు తీసి పెట్టారని నిర్వాహకులను ప్రశ్నించారు. ఇందులో డెంటల్ ఆసుపత్రి ఉందని, మిగితా వైద్యసేవలు మూసి వేశామన్నారు. అంతేకుండా ఇందులో నుంచి ఇంట్లోకి వెళ్లాల్సిన దారి ఉందని డెంటల్ డాక్టర్ రామకృష్ణ వైద్యాధికారులకు తెలిపారు. మెయిన్ షెటర్ దగ్గరుండి మూసి వేయించారు.

● ఎనిమిది నెలల క్రితం సీఐడీ విచారణ

సప్తగిరి ఆసుపత్రిలో సీఎంఆర్ఎఫ్ బిల్లుల అవకతవకలపై సీఐడీ అధికారులు గత ఏడాది సెప్టెంబరు 10వ తేదీన తనిఖీలు చేపట్టారు. రోగులకు చికిత్స చేయకుండా చేసినట్లుగా బిల్లులు సృష్టించిన వ్యవహారంలో వాటికి సంబంధించిన ఆధారాలు సేకరించారు. ఆసుపత్రి డాక్టర్ వంశీని సైతం విచారించారు. తనకు తెలియకుండా ఎవరో బిల్లులు ఇచ్చారని వైద్యుడు వివరణ ఇచ్చాడు. అవకతవకలు జరిగినట్లుగా నిర్ధారించిన సీఐడి వైద్యారోగ్య శాఖకు నివేదికను అందించింది. ఆ సమయంలోనే సదరు ఆసుపత్రిని బ్లాక్ లిస్ట్‌లో పెట్టారు. ప్రస్తుతం ఆసుపత్రి రిజిస్ట్రేషన్ రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

చేపల వేటకు వెళ్లి బాలుడి మృతి

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లాలోని కొత్తపల్లి మండలం రేకుర్తి సాలెహ్‌నగర్‌కు చెందిన మహ్మద్ అహిర్ అజ్మన్(11) అనే బాలుడు చేపలవేటకు వెళ్లి ప్రమాదవశాత్తు బావిలోపడి మృతి చెందాడు. కొత్తపల్లి పోలీసుల వివరాల ప్రకారం... స్థానిక వెంకటేశ్వర కాలనీ శ్మశానవాటిక సమీపంలో ఉన్న ఒక వ్యవసాయ బావి వద్దకు శనివారం ఉదయం అహిర్ అజ్మన్‌తోపాటు అతడి స్నేహితులు మహ్మద్ అన్సర్, మహ్మద్ అర్మన్ చేపలు పట్టేందుకు వెళ్లారు. చేపలు పడుతున్న సమయంలో అహిర్ అజ్మన్ ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడిపోయాడు. ఈత రాకపోవడంతో నీటిలో మునుగుతుండగా స్నేహితులు కాపాడండి అంటూ కేకలు వేశారు. స్థానికులు వచ్చి కాపాడే ప్రయత్నం చేయగా అప్పటికే నీట మునిగాడు. సమాచారం అందుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది తాళ్లు, ఇతర పరికరాల సహాయంతో అహిర్ అజ్మన్ మృతదేహాన్ని బయటకు తీశారు. అహిర్ అజ్మన్ తండ్రి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అంజన్న సన్నిధిలో భక్తుల సందడి



అంజన్నను దర్శించుకుంటున్న భక్తులు

మల్యాల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో కిటకిటలాడింది. వేకువజాము నుంచే వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముడి ఆలయంలో పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు, పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్ ఇతర అధికారులు పర్యవేక్షించారు.

స్వగ్రామానికి చేరిన శ్రీనివాస్ మృతదేహం

- తొమ్మిది రోజుల క్రితం దుబాయ్‌లో హత్య

- దమ్మన్నపేట గ్రామంలో విషాదం





స్వర్గం శ్రీనివాస్ మృతదేహం దగ్గర రోదిస్తున్న కుటుంబసభ్యులు, పాడె మోస్తున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): దుబాయ్‌లో కొద్దిరోజుల క్రితం పాకిస్తానీ చేతిలో హత్యకు గురైన స్వర్గం శ్రీనివాస్ (43) అనే వ్యక్తి మృతదేహం శనివారం ఆయన స్వగ్రామమైన జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం దమ్మన్నపేటకు చేరుకుంది. దీంతో శ్రీనివాస్ భార్య జమున, కొడుకులు చందు, సూర్య, తల్లి రాజవ్వ బోరున విలపించారు. స్వర్గం శ్రీనివాస్ అనే వ్యక్తిని తొమ్మిది రోజుల క్రితం పాకిస్తానీ దారుణంగా నరికి చంపారు. దీంతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. దమ్మన్నపేట గ్రామానికి చెందిన స్వర్గం శ్రీనివాస్ కొన్నేళ్ల క్రితం దుబాయ్‌కి వెళ్లి అక్కడ ఓ బేకరిలో పని చేస్తుండేవాడు. పని ఒత్తిడి, మత విద్వేషం కూడా తోడు కావడంతో సహోద్యోగి అయిన పాకిస్తానీ దమ్మన్నపేట గ్రామానికి చెందిన స్వర్గం శ్రీనివాస్, నిర్మల్ జిల్లా సోన్ మండల కేంద్రానికి చెందిన అష్టపు ప్రేమ్ సాగర్ అనే ఇద్దరు వ్యక్తులను నరికి చంపాడు. అప్పటి నుంచి శ్రీనివాస్ భార్య, కొడుకులతో పాటు తల్లి స్వర్గం రాజవ్వ మృతదేహం రాకకోసం నిత్యం ఎదురు చూస్తున్నారు. ఎట్టకేలకు శ్రీనివాస్ మృతదేహం శనివారం ఇంటికి చేరుకోగా కుటుంబసభ్యులు విలపించారు.

● అంత్యక్రియల్లో పాల్గొన్న విప్ లక్ష్మణ్‌కుమార్

స్వర్గం శ్రీనివాస్ మృతదేహానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ శనివారం నివాళులర్పించారు. గోదావరి నది వద్ద మృతుడి అంత్యక్రియలు నిర్వహించగా అంతిమ యాత్రలో విప్ పాల్గొని పాడె మోసారు. మృతుడి అంత్యక్రియల కోసం రూ.10 వేలు అందించారు. కలెక్టర్ ప్రభుత్వం పక్షాన రూ.15 వేలు అంత్యక్రియల ఖర్చు కోసం అందించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చి అండగా ఉంటామని విప్ హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దుబాయ్‌లో తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఇద్దరు వ్యక్తులు హత్యకు గురయ్యారని తెలిసిన వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి మృతదేహాలను స్వదేశానికి తీసుకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారన్నారు. శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు ఎన్ఆర్ఐ పాలసీ కింద రూ.5 లక్షలు, కుటుంబంలో ఒకరికి ఔట్ సోర్సింగ్ జాబ్, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి మృతుడి కుటుంబ సభ్యులకు రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన వెంట టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు చిలుముల లక్ష్మణ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు అప్పం తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై సీసీఎస్ పోలీసుల దాడి

మేడిపల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వకోట గ్రామశివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో సీసీఎస్ పోలీసులు శనివారం దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఏడుగురుని అదుపులోకి తీసుకొని వారి వద్దనుంచి రూ. 11,100, ఏడు మొబైల్ ఫోన్స్‌ను సీజ్ చేసినట్లు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. పేకాటలో పట్టుబడ్డ వారిని మేడిపల్లి పోలీసులకు అప్పగించగా కేసు నమోదు చేశామని ఎస్సై శ్యామ్‌రాజ్ తెలిపారు. దాడుల్లో కానిస్టేబుల్ రమేష్, అఫ్రోజ్, కమలాకర్ పాల్గొన్నారు.

గంగాధర మండలం హిమ్మత్‌నగర్‌లో..

గంగాధర(ఆంధ్రజ్యోతి): మండలంలోని హిమ్మత్ నగర్‌లో పేకాట ఆడుతున్నవారిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ వంశీక్రిష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. గ్రామ శివారులో పేకాడుతున్నారని పక్కా సమాచారం మేరకు అక్కడికి వెళ్లి పట్టుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 9,600 రూపాయలు స్వాధీనం చేసుకొని నలుగురి పై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు.

అధిక వడ్డీలకు అప్పులు ఇచ్చిన వ్యక్తికి జరిమానా

ఇల్లంతకుంట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఇల్లంతకుంట మండలంలోని కందికట్కూరు గ్రామానికి చెందిన రంగు శ్రీనివాస్ అధిక వడ్డీలకు అప్పులు ఇస్తుండడంతో కలెక్టర్ జరిమానా విధించినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస్ అధిక వడ్డీలకు అప్పులు ఇస్తూ ఇబ్బంది పెడుతున్నారనే సమాచారం మేరకు గత నవంబరు నెలలో ఇంట్లో తనిఖీలు చేయగా ప్రామిసరీ నోట్లు, డాక్యుమెంట్లు లభించడంతో కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం శనివారం కలెక్టర్ 20 వేల రూపాయల జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

మోటార్ల చోరీ కేసులో నిందితుల అరెస్ట్

ఓదెల ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ఇద్దరు వ్యవసాయ మోటర్ల చోరీ నిందితులను శనివారం అరెస్ట్ చేసినట్లు పొత్కపల్లి ఎస్సై రమేష్ పేర్కొన్నారు. శుక్రవారం పొత్కపల్లి పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీసీపీ పుల్ల కరుణాకర్ నిందితుల వివరాలను వెల్లడించారు. సుల్తానాబాద్ సర్కిల్ పరిధిలోని ఓదెల, కాల్వశ్రీరాంపూర్, సుల్తానాబాద్, జూలపల్లి మండలాల్లో రైతులు బావులు, వాగులు, చెరువులపై సాగునీటి అవసరాలకు అమర్చుకున్న విద్యుత్‌మోటార్లు, సర్వీస్ వైర్లను చోరీకి పాల్పడగా కేసులు నమోదు చేశారు. ఓదెల మండలం శివారు జమ్మికుంటకు వెళ్లే రహదారిలో ఎస్సై దీకొండ రమేష్ సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా ట్రాలీ వాహనంలో ఓదెల తారకరామ కాలనీ, బుడిగజంగాల వాడకు చెందిన సిరిగిరి ప్రసాద్, అంగిడి సాయికుమార్ అనుమానాస్పదంగా కనిపించారు. వారిని అదుపులోకి తీసుకొని వాహనాన్ని తనిఖీ చేయగా విద్యుత్ మోటార్లు, సర్వీస్ వైర్లు కనిపించడంతో విచారణ చేపట్టారు. జల్సాలకు అలవాటు పడి వీరిద్దరు పొత్కపల్లి, కాల్వశ్రీరాంపూర్, జూలపల్లి, సుల్తానాబాద్ పోలీస్ సర్కిల్ పరిధిలోనిలో చోరీలకు పాల్పడ్డారని, ట్రాలీలో తిరుగుతూ, జూలపల్లి మండలం కాచాపూర్‌లో ఆరు మోటార్లు, కోనరావుపేటలో ఒకటి, ఓదెల మండలం కొమిర ఎస్సారెస్పీ కాలువ వద్ద ఆరు మోటార్లు, కొలనూర్ శివారులో ఐదు మోటార్లు, పోత్కపల్లి శానగొండ శివారులో నాలుగు మోటార్లు, అలాగే 17 బావుల వద్ద నుంచి 170 మీటర్ల సర్వీస్ వైరు చోరీ చేశారు. రూపునారాయణపేట మానేరు వాగులోని 23 విద్యుత్ బోర్‌మోటార్లు, ఓదెల శివారులోని ఆరు మోటార్లను ఎత్తుకెళ్లారని తెలిపారు. సిరిగిరి ప్రసాద్ ఇనుప సామాను వ్యాపారం చేస్తూ ఆర్థిక నష్టాలకు గురయ్యాడు. దీంతో సునాయసంగా డబ్బులు సంపాదించేందుకు ఆన్‌లైన్ బెట్టింగ్‌లో డబ్బులను పోగొట్టుకున్నాడని తెలిపారు. దీంతో ఇదే గ్రామానికి చెందిన అంగడి సాయికుమార్‌తో కలిసి ఇనుప సామాను దొంగిలించే వారని తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.10.67లక్షల విలువ చేసే విద్యుత్ మోటార్లు, 750 మీటర్ల సర్వీస్ వైరును, ఆటో ట్రాలీ, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ తెలిపారు. దొంగలను పట్టుకున్న ఏఎస్ఐ రత్నాకర్‌తో పాటు 13 మంది పోలీస్ సిబ్బందిని డీసీపీ అభినందించి రివార్డులను అందించారు. ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ సుబ్బారెడ్డి, ఎస్సై దీకొండ రమేష్ పాల్గొన్నారు.



నిందితుల అరెస్టు చూపుతున్న డీసీపీ కరుణాకర్



చిత్రజ్యోతి
SINCE 1965



ఆ లోటును భర్తీ చేస్తుంది

- మోహనకృష్ణ ఇంద్రగంటి

'అష్టాచెమ్మ', 'గోల్కొండ హైస్కూల్', 'సమ్మోహనం' వంటి చిత్రాలతో సెన్సిబుల్ దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు మోహనకృష్ణ ఇంద్రగంటి. ఆయన తెరకెక్కించిన తాజా చిత్రం 'సారంగపాణి జాతకం'. ప్రియదర్శి, రూప కొడవాయూర్ ప్రధాన పాత్రల్లో నటించారు. శివలెంక కృష్ణప్రసాద్ నిర్మించారు. ఈ నెల 25న సినిమా విడుదలవుతోన్న సందర్భంగా మోహనకృష్ణ మీడియాతో ముచ్చటించారు. "ఒకప్పటితో పోల్చితో తెలుగులో పూర్తి స్థాయి కామెడీ చిత్రాల సంఖ్య తగ్గిపోయింది. ఆ లోటును భర్తీ చేస్తుందీ చిత్రం. కథానాయకుడి పాత్రకు ఎవరు సరిపోతారా అని వెతికే క్రమంలో, ప్రియదర్శి నటించిన 'బలగం'తో పాటు ఆయన చేసిన మరికొన్ని చిత్రాలు చూశా. ఈ కథకు ఆయనే సరిపోతారనిపించింది. ఇందులో పాత్రలన్నీ కొత్తగా ఉంటాయి. కేవలం థియేటర్లో చూసి ఆనందించడమే కాకుండా.. కొన్ని రోజుల పాటు మాట్లాడుకునేలా ఉంటుందీ సినిమా. అన్ని వర్గాలను మెప్పించే ఈ చిత్రం, కాసేపు మీ కష్టాలన్నింటినీ మర్చిపోయేలా చేస్తుంది. జాతకాలను అతిగా నమ్మే ఓ యువకుడి జీవితంలో జరిగిన ఆసక్తికరమైన సంఘటనలే చిత్రకథాంశం. నమ్మకం మూఢనమ్మకంగా మారి, ఇతరుల్ని ఇబ్బందిపెట్టకూడదనే సందేశాన్ని వినోదాత్మకంగా అందిస్తుంది. సినిమాలో కడుపుబ్బా నవ్వుకునే వినోదంతో పాటు ఓ క్రైమ్ ఎలిమెంట్ ఉంటుంది. అది చాలా ఆసక్తికరంగా ఉంటుంది. దర్శకుడిగా ఈ సినిమా నాకు చాలా సంతృప్తిని ఇచ్చింది. ఇప్పుడు ప్రేక్షకుల అటెన్షన్ స్పాన్ తగ్గిపోయింది. వారు థియేటర్లో మొబైల్ తీయకుండా ఉంచగల స్థాయిలో సినిమాలు తీయడం దర్శకులు నేర్చుకోవాలి" అని చెప్పారు.




ఎన్ని అబద్ధాలు చెప్పినా మా సినిమా గెలుస్తుంది

విజయశాంతి

"'అర్జున్ సన్నాఫ్ వైజయంతి' సినిమాను హిట్ చేసిన ప్రేక్షకులకు పాదాభివందనాలు. క్లైమాక్స్ కోసం కల్యాణ్‌బాబు తీసుకున్న రిస్క్ వల్లే సినిమా ఇంత గొప్పగా వచ్చింది. సినిమాకు నెగెటివ్ ప్రచారం చేయడం మంచి పద్ధతి కాదు. దుష్ప్రచారం చేసేవారు దయచేసి మైండ్‌సెట్‌ను మార్చుకోండి. వారు సినిమా బాగాలేదని ఎన్ని అబద్ధాలు చెప్పినా, చివరికి మా సినిమానే గెలుస్తుంది. కోట్లు ఖర్చు పెట్టి తీసిన సినిమాను బ్రతకనివ్వండి. మనస్ఫూర్తిగా సినిమాను దీవించడం నేర్చుకోండి" అని నటి విజయశాంతి అన్నారు. కల్యాణ్‌రామ్ కథానాయకుడిగా ప్రదీప్ చిలుకూరి తెరకెక్కించిన ఈ చిత్రం ఇటీవలె విడుదలైంది. సక్సెస్ మీట్‌లో కల్యాణ్‌రామ్ మాట్లాడుతూ "కమర్షియల్ సినిమాలోనూ కొత్తదనం ఉంటేనే ప్రేక్షకులు ఇష్టపడుతున్నారు. ఈ విషయంలో దర్శకుడు ప్రదీప్ ప్రేక్షకుల అంచనాలను అందుకున్నాడు" అని చెప్పారు.













మహిళా సంఘాలకు ప్రాధాన్యం

● 50 శాతం మేర కొనుగోలు కేంద్రాల బాధ్యతలు

● ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



మహాత్మానగర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

తిమ్మాపూర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో మహిళా సంఘాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్‌తోపాటు మండలంలోని మహాత్మానగర్, రామకృష్ణకాలనీ, తిమ్మాపూర్, ఇందిరానగర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు కోటీశ్వరులను చేయాలన్న సీఎం రేవంత్ రెడ్డి ఆశయం మేరకు మహిళా సంఘాలకు 50 శాతం ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తున్నట్లు చెప్పారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధగోని లక్ష్మీనారాయణగౌడ్, మండల అధ్యక్షుడు బండారి రమేష్, నాయకులు పాల్గొన్నారు.

గన్నేరువరం: మండలంలోని గన్నేరువరం, మైలారం, మాదాపూర్, హన్మాజిపల్లి, జంగపల్లి, గునుకుల కొండాపూర్ గ్రామాల్లో ఐకేపీ, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు.అనంతరం వివిధ గ్రామాలకు చెందిన 21 మంది లబ్ధిదారులకు సీఎమ్మార్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. తహశీల్దార్ నరేందర్, ఎంపీడీవో శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

చొప్పదండి:మండలంలోని గుమ్లాపూర్‌లో ఐకేపీ, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను మార్కెట్ కమిటీ చైర్మన్ మహేష్ ప్రారంభించారు.

గంగాధర: గంగాధర మండలం ముప్పిడిపల్లి, కోట్లనర్సింహులపల్లిలో కొనుగోలు కేంద్రాలను గంగాధర మార్కెట్ కమిటీ చైర్మన్ రజితశ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. మండల అధ్యక్షుడు మనోహర్ పాల్గొన్నారు.

● న్యూస్‌బాక్స్

లబ్ధిదారుల ఎంపికను పరిశీలించండి

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలంలో అన్ని గ్రామ పంచాయతీల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికను పరిశీలించాలని మెప్మా పీడీ సూచించారు. శనివారం కరీంనగర్ మండల పరిషత్‌లో గ్రామ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. రాజీవ్ యువ వికాస్ ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ముగిసినందున దరఖాస్తు దారుల స్థితి గతులపై విచారణ చేపట్టాలని సూచించారు. ఎంపీడీవో సంజీవరావు పాల్గొన్నారు.

ట్రాక్ సూట్‌ల పంపిణీ

భగత్‌నగర్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వర్క్‌సైట్ విద్యార్థులకు చింతకుంట పాఠశాలలో ఇటుక బట్టీల యజమానుల చేతుల మీదుగా శనివారం ట్రాక్ సూట్‌లను పంపిణీ చేశారు. కొత్తపల్లి ఎంఈవో ఆనందం తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తి పెంపొందించుకోవాలి

గణేశ్‌నగర్,ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు దేశభక్తి పెంపొందించుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్యాల రాకేష్ అన్నారు. వివేకానంద డిగ్రీ కళాశాలలో శనివారం పాలిసెట్ ఉచిత బోధనా తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక స్పృహ, సేవా భావం కలిగి ఉండాల న్నారు.

అక్రమ నిర్మాణం ఫిర్యాదుపై విచారణ

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం నగునూర్‌లోని ప్రభుత్వం స్థలంలో అక్ర మ నిర్మాణాల ఫిర్యాదుపై ఎంపీవో జగన్‌మోహన్ రెడ్డి శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. గ్రామంలోని సర్వే నంబరు 669లో 30గుంటల ప్రభుత్వ స్థలంలో కొలపురి కందయ్య, తండ్రి పోచయ్య అనే వ్యక్తి అనుమతులు లేకుండా షెడ్ నిర్మాణం చేపట్టాడని అదే గ్రామానికి చెందిన దాసరి రాజేష్ కన్న ఇటీవల డీఎల్‌పీవోకు ఫిర్యాదు చేశారు.

టెట్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

సుభాష్‌నగర్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): టెట్ అభ్యర్థులకు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు డాక్టర్ ప్రసన్న హరికృష్ణ తెలిపారు. శనివారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరులతో మాట్లాడారు. విన్నర్స్ ఆన్‌లైన్ యాప్ ద్వారా నిపుణులతో తరగతులు నిర్వహించనున్నట్లు చెప్పారు. తాను ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడినా నిరంతరం నిరుద్యోగుల కోసం పోరాడుతానన్నారు. హెచ్‌సీయూ భూముల కోసం విద్యార్థులు పోరాటం చేశారని, అక్కడ గెలిచిన వారుగానీ, పోటీ చేసినవారుగానీ వెళ్లలేదని అన్నారు. తాను వెళ్లి విద్యార్థులతో మాట్లాడానని తెలిపారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన లింగంపల్లి నాగరాజును జిల్లా కోర్టు కార్యాలయంలో తెలంగాణ రజక సంఘం (బీఆర్‌ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు పూసాల సంపత్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. కంచర్ల అనిల్, కొల్లూరి కుమార్, రాజారామన్, పూసాల శ్రీకాంత్, మధు, వెదిర వెంకటేశ్, నంగునూరి ఎల్లయ్య, లింగంపల్లి అంజి తదితరులు పాల్గొన్నారు.

మానేరు రివర్ ఫ్రంట్‌ను అడ్డుకునే కుట్ర

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): మానేరు రివర్ ఫ్రంట్‌ను అడ్డుకునేందుకు బీజేపీ, కాంగ్రెస్ నాయకులు కుట్రలు చేస్తున్నారని బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్ అన్నారు. శనివారం నగరంలోని మీసేవా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కరీంనగర్‌ను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, గంగుల కమలాకర్, మాజీ ఎంపీ వినోద్‌కుమార్ కృషి చేశారన్నారు. 542 కోట్లను మంజూరు చేసి పనులు ప్రారంభించారన్నారు. బోయినపల్లి వినోద్‌కుమార్, గంగుల కమలాకర్ చొరవతో సాఫీగా సాగాయన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అవినీతి జరిగిందంటూ పనులను ఆపారన్నారు. మానేరు రివర్ ఫ్రంట్ కోసం కేటాయించిన నిధులతో పూర్తి చేయాలన్నారు. మాజీ మంత్రిగంగుల కమలాకర్ అసెంబ్లీలో గళమెత్తగా కాంగ్రెస్ పాలకులు మళ్లీపనుల ప్రారంభించారన్నారు. ఇప్పుడు ఆ పనులను ఆపేందుకు బీజేపీ కుట్ర చేస్తోందన్నారు. బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి ప్రశాంత్‌రెడ్డి, మైనార్టీ అధ్యక్షుడు షౌకత్ అలీ, చందు, వాజిద్, మోహన్, రవి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపులలో భాగంగా ఆదివారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ వన్, టు, ఏడీఈ శ్రీనివాస్ గౌడ్, లావణ్య ప్రకటనలో తెలిపారు. ఉదయం 8:30 గంటల నుంచి 10:30 వరకు నాగులఎల్లమ్మ గుడి ఏరియా, శ్మశాన వాటిక ఏరియా, వివేకానంద నగర్ కాలనీ, జ్యాస్ బేకరీ, అల్కాపురి కాలనీ, గిద్ద పెరమండ్ల టెంపుల్, ఉదయం 9గంటల నుంచి 11 వరకు ముకరాంపుర, గీతాభవన్, పోలీస్ హెడ్ క్వార్టర్స్, జడ్పీ ఏరియా, మున్సిపల్‌కార్యాలయం, ఉదయం 8గంటల నుంచి 11 వరకు సుభాష్‌నగర్, ఆదర్శనగర్, అరుణోదయ ఫైనాన్స్, బుట్టి రాజారాం కాలనీ, మంచిర్యాల చౌరస్తా, రెనీ హాస్పిటల్, వావిలాల రాంరెడ్డి నగర్, ఉదయం 7 గంటల నుంచి 10 వరకు ఐబీ చౌరస్తా, పద్మనాయక కల్యాణ మండపం, సర్కస్ గ్రౌండ్, కృష్ణ డయాగ్నోస్టిక్స్ రెడ్డిగారి వంటిల్లు ,వన్ హాస్పిటల్, కోర్టు చౌరస్తా, ఉదయం 8:30 నుంచి 10:30 వరకు శ్రీనగర్ కాలనీ, భవానీ కాలనీ, సప్తగిరి కాలనీ, తాహెరా మసీదు, అంజనాద్రి ఆలయం, దోబీ ఘాట్, గోదామ్ ప్రాంతం, బీఎస్ఎఫ్ క్వాటర్స్, ఏహెఎస్, పార్క్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

లివర్ పాడవడానికి మద్యం ఒక్కటే కారణం కాదు



కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్యులు

సుభాష్‌నగర్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): లివర్ పాడవడానికి మద్యమే కారణమనే అపోహ ప్రజల్లో ఉందని, మద్యంతోపాటు అధిక బరువు, ఇన్‌ఫెక్షన్లు కూడా కారణమవుతాయని మెడికవర్ వైద్యులు తెలిపారు. వరల్డ్ లివర్‌డే సందర్భంగా శనివారం స్థానిక సర్కస్ గ్రౌండ్‌లో వాకర్స్ కోసం ఉచిత వైద్య శిబిరం, హెల్త్ టాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనిషి ఆరోగ్య క్రమశిక్షణ పాటిస్తే అన్ని అవయవాలు భద్రంగా ఉంటాయన్నారు. ఆరోగ్యానికి ఆహారమే మందు అని, ఆహారం మితంగా తీసుకుంటూ ప్రతి రోజు ఒక గంట వ్యాయామం చేయాలని సూచించారు. లివర్ పరితీరును బట్టే మనిషి జీవక్రియలు, జీర్ణక్రియ సక్రమంగా పనిచేస్తాయన్నారు. మద్యం సేవించేవారు అల్ట్రాసౌండ్ పరీక్ష చేసుకొని ఫ్యాటీ లివర్ ఉంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలని సూచించారు. మెడికవర్ ఆసుపత్రిలో అన్నిరాకల సూపర్‌స్పెషాలిటీ వైద్యులు అందుబాటులో ఉన్నారని, అన్నివేళలా వైద్యసేవలు అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ ప్రణీత్, డాక్టర్ వినయ్‌కుమార్, డాక్టర్ లేకేష్, సూపరింటెండెంట్ డాక్టర్ రవి మల్లారెడ్డి, మార్కెటింగ్ మేనేజన్ కరుణాకర్, ఆపరేషన్స్ మేనేజర్ సాయిచరణ్, హెచ్ఆర్ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

తవ్వి.. వదిలేశారు

(1వ పేజీ తరువాయి)

ఈ పనులు ఎప్పుడో పూర్తయ్యేవని ప్రజలు అంటున్నారు. కాంట్రాక్టర్‌కు జారీ చేసిన 32 కోట్ల చెక్కు పాస్ చేస్తే అతను వెంటనే పనులు చేపట్టే అవకాశం ఉన్నదని, చేసిన పనులకే బిల్లులు రాని పరిస్థితుల్లో అదనపు పెట్టుబడి పెట్టలేకనే పనులు నిలిపి వేశారని కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులు అంటున్నారని తెలిసింది. మంత్రి పొన్నం ప్రభాకర్ ఇప్పటికైనా కరీంనగర్ కార్పోరేషన్‌పై దృష్టి సారించి నిలచి పోయిన అంతర్గత రోడ్ల పనులను పూర్తి చేయించాలని నగరవాసులు కోరుతున్నారు.

'వారధి' కథా సంకలనం ఆవిష్కరణ



'వారధి' కథా సంకలనం ఆవిష్కరిస్తున్న అతిథులు

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో శనివారం భగత్‌నగర్ భగవతి హైస్కూల్‌లో కథా రచయిత మనోహరాచారి రచించిన 'వారధి' కథా సంకలనాన్ని ఆవిష్కరించారు. మహాత్మా జ్యోతీబాపూలే గురుకుల పాఠశాలల రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జీవీ శ్యాంప్రసాద్‌లాల్, సాహితీవేత్త, అవధాని డాక్టర్ గంగ్ర లక్ష్మణరావు, కథా, నవలా రచయిత బెజ్జారపు వినోద్‌కుమార్, బలగం సినిమా ఫేం ఏలేశ్వరం సత్యం, భగవతి విద్యాసంస్థల కరస్పాండెంట్ రమణారావు, స్తంభంకాడి గంగాధర్, సంస్థ అధ్యక్షుడు గాజుల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

నిరాదరణకు గురైన తల్లిదండ్రులు

- న్యాయం చేయాలని వేడుకోలు

సుభాష్‌నగర్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): అందరూ ఉండి నిరాదరణకు గురైన తల్లిదండ్రులు అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చేరారు. బాధితులు కరీంనగర్ రూరల్ మండలం, వల్లంపహాడ్‌కు చెందిన గుడిమెట్ల నారాయణ, అండమ్మ శనివారం తమ గోడు వెల్లబోసుకున్నారు. తమకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లని, అందరికి వివాహాలు చేశామని తెలిపారు. గతంలో అమ్మిన భూమికి సంబంధించి తమకు రావాల్సిన డబ్బులు విషయమై కుమారుడిని అడిగితే దాడి చేశాడని ఆరోపించారు. కొద్ది రోజులుగా నారాయణకు ఆరోగ్య సమస్యలు ఎక్కువ కావడంతో జిల్లా జనరల్ ఆస్పత్రి చేరినట్లు తెలిపారు. తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

'కోర'లో గ్రాడ్యుయేషన్ డే



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

గణేశ్‌నగర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పట్టణంలోని కోర పాఠశాలలో శనివారం యూ కేజీ విద్యార్థుల గ్రాడ్యు యేషన్ డే నిర్వహిం చారు. ఎస్‌వీజేసీ విద్యా సంస్థల చైర్మన్ ఉట్కూరు మహిపాల్ రెడ్డి కార్యక్ర మాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. విద్యా సంస్థల డైరెక్టర్లు వరప్రసాద్, సింహాచలం హరికృష్ణ, రాంరెడ్డి, వంగల సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు గర్వపడేలా ఎదగాలి

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు గర్వపడేలా విద్యార్థులు ఎదగాలని ఎస్‌యూ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ మనోహర్ అన్నారు. ఎస్సారార్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం సర్టిఫికెట్ల ప్రదానోత్సవంలో మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లుగా ఉండి మంచి క్రమశిక్షణతో జీవితంలో రాణించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ఎస్ఎస్ చైర్మన్ ప్రొఫెసర్ రామకృష్ణ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వాలంటర్‌గా సేవా భావాన్ని శ్రమించేతత్వాన్ని పెంచు కోవాలన్నారు. టీజీసీజీటీఏ స్టేట్ జనరల్ సెక్రెటరీ డాక్టర్ సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉర్దూ మీడియం పాఠశాలలో వార్షికోత్సవం



కార్యక్రమంలో మాట్లాడుతున్న అతిథులు

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 19 (ఆంధ్ర జ్యోతి): నగరంలోని దుర్గమ్మగడ్డ ప్రభుత్వ ఉర్దూ మీడియం ప్రైమరీ స్కూల్ వార్షికోత్సవాన్ని శనివారం దక్కన్ గెస్ట్ హౌస్‌లో ఘనంగా నిర్వహించారు. ఎంఈవో భద్రయ్య, ఏఎంవో అశోక్‌రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ షమీ, ఐదో డివిజన్ మాజీ కార్పొరేటర్ జహరా భాను, హెచ్ఎం ఎజాస్ ఫాతిమా, ఉపాధ్యాయులు అస్మినా బేగం, కుర్షిదా ఇక్బాల్, వాజిద్, మెరాజ్ ఫాతిమా, మనీషా నస్రీన్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకులకు తీవ్రగాయాలు

హుజూరాబాద్‌రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెల్పూర్ గ్రామపంచాయతీ పరిధిలోని తోకలపల్లిలో శనివారం హుజూరాబాద్-జమ్మికుంట ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయాలపాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం హుజూరాబాద్ పట్టణానికి చెందిన దండు గూడెం హరిచరణ్, గంగ్రకోట రాజశేఖర్ ద్విచక్రవాహనంపై జమ్మికుంట వైపు వెళ్తున్న క్రమంలో తోకలపల్లి వద్ద వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో హరిచరణ్, రాజశేఖర్ ఇద్దరు వాహనం పైనుంచి కిందపడటంతో తలకు, కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించారు. చికిత్స కోసం హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

ఆరుగురిపై వరకట్నం కేసు నమోదు

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): అదనపు వరకట్నం కోసం అత్తింటి వారు వేధిస్తున్నారని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీస్‌లు ఆరుగురిపై కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లికి చెందిన స్వర్ణలత భూపాలపల్లికి చెందిన కర్ణమాల సాయిరాంతో 2023లో వివాహం జరిగింది. వివాహ సమయంలో రూ.25 లక్షల నగదు, రెండు తులాల బంగారం ముట్ట చెప్పారు. రెండునెలల పాటు వారి కాపురం సజావుగా సాగింది. ఆ తర్వాత నుంచి భర్త నిత్యం మద్యం సేవిస్తూ అదనపు కట్నం తేవాలంటూ వేధింపులకు గురిచేయడం మొదలుపెట్టాడు. భర్తతో పాటు అత్త ఆదిలక్ష్మి, మామ రాములు, బావ రాము, యారాలు మౌనిక, ఆడపడుచు శరణ్య, ఆశోక్ వేధిస్తున్నారని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

పురుగుల మందుతాగి ఆత్మహత్య

వీణవంక, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగారంలో కొండబోయిన ప్రియాంక(23) అనారోగ్య సమస్యలతో శుక్రవారం పురుగుల మందు తాగి అత్మహత్యాయత్నం చేసింది. గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్ ప్రభుత్వం అసుపత్రికి తరలించగా చికిత్సపొందుతు మృతి చెందింది. మృతురాలి తండ్రి కొండబోయిన సంపత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తిరుపతి తెలిపారు.

'జ్యోతిష్మతి'లో ఘనంగా వార్షికోత్సవం



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, విద్యాసంస్థల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు

తిమ్మాపూర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక జ్యోతిష్మతి గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్‌లో విద్యాసంస్థల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు అధ్యక్షతన శనివారం సాయంత్రం వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, జేఎన్‌టీయూ(హైదారాబాద్) రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ వి కామాక్షిప్రసాద్ ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఇంటర్ కాలెజియేట్ టెక్నికల్ స్పోర్ట్స్ పోటీలు, ఇంట్రా-కాలేజ్ సాంస్కృతిక పోటీల్లో విజేతలకు ట్రోఫిలు, పతకాలు, నగదు బహుమతులు, అందజేశారు. కార్యక్రమంలో విద్యా సంస్థల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ జువ్వాడి సుమిత్‌సాయి, ప్రిన్సిపాల్ టి అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

భార్య కళ్లముందే కాల్వలోకి దూకి భర్త ఆత్మహత్య



సాగర్(ఫైల్)

రామడుగు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాల్‌రావుపేటలో భార్య కళ్లముందే భర్త గ్రావిటీ కాలువలో దూకి శుక్రవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని శనివారం ఉదయం గజ ఈతగాళ్లు బయటకు తీశారు. పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు... మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన పురాణం సాగర్(30) అనే యువకుడు కూలి పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మద్యం అతిగా తాగడంతో కాలేయం, పెద్ద పేగు సంబంధిత సమస్యతో బాధపడుతున్నాడు. గతంలో కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో శస్త్రచికిత్స సైతం చేయించుకున్నాడు. కొంతకాలం బాగానే ఉన్న సాగర్ తిరిగి మద్యానికి బానిసకాగా సమస్య తిరగబెట్టింది. దీంతో మరోసారి శస్త్రచికిత్స చేయించుకోవ డానికి డబ్బులు లేకపోవడంతో ఇబ్బందులు పడ్డాడు. ఈ విషయపై తరచూ భార్యాభర్తల మధ్య వాగ్వాదం జరిగింది. శుక్రవారం ఇంట్లో నుంచి బయటకు వెళ్తన్నానని చెప్పి రాత్రి వరకు రాలేదు. సాగర్ గ్రావిటీ కెనాల్ వద్ద ఉన్నాడని సమాచారం అందడంతో అక్కడికి వెళ్లింది. అక్కడ వారిమధ్య కొంత వాగ్వాదం జరిగింది. ఇల్లు తాకట్టు పెట్టి ఆపరేషన్ చేయిస్తానని, ఏం బాధపడవద్దని భార్య పద్మ ఆయనను వారించినప్పటికీ సాగర్ తాను బ్రతకడం కష్టమని, అలా వాదిస్తూనే కాలువలోకి దూకాడు. దీంతో షాక్‌కు గురైన పద్మ వెంటనే తేరుకొని అరవడంతో అక్కడ నుంచి వెళ్తున్న కొంతమంది కాలువ వద్దకు వచ్చి లోపలికి చూసినప్పటికీ ఆచూకీ దొరకలేదు. దీంతో శనివారం ఉదయం గజ ఈతగాళ్ల చేత గాలింపు చేపట్టి సాగర్ మృతదేహాన్ని వెలికితీశారు. కళ్ల ముందే భర్త ఆత్మహత్యకు పాల్పడడంతో కుటుంబం పెద్ద దిక్కు కోల్పోయినట్టయింది. మృతుడు సాగర్ భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు.

27న మోడల్ స్కూల్ అడ్మిషన్ టెస్టు

శంకరపట్నం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ 2025-26 విద్యా సంవత్సరానికి దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 27న అడ్మిషన్ టెస్టు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సరిత శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 27న ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 6వ తరగతి విద్యార్థులకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు 7వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 21న సంబంధిత ప్రభుత్వ వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ పరీక్షకు సంబంధించి నియమ నిబంధనలు హాల్ టికెట్‌లో ఉంటాయని తెలిపారు.

వీహెచ్‌పీ ఆధ్వర్యంలో ధర్నా

సుభాష్‌నగర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ బెంగాల్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెంగాల్ రాష్ట్రంలో హిందువులకు రక్షణ కరువైందన్నారు. పాలకులు ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. బెంగాల్ రాష్ట్రంలో రాష్ట్రపతిపాలన విధించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందచేశారు.

మున్సిపల్ ఆధ్వర్యంలో తడి, పొడి చెత్తపై సైన్స్ ఎగ్జిబిషన్



ఎగ్జిబిట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్/హుజూరాబాద్‌రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాయిరూప గార్డెన్‌లో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో తడి, పొడి చెత్తపై విద్యార్థులకు సైన్స్ ఎగ్జిబిషన్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు హాజరై ఎగ్జిబిట్లు తయారు చేసి ప్రదర్శించారు. వాటిని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, వరంగల్ మున్సిపల్ ఆర్‌జేడీ సాహిద్ మసూద్, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, జిల్లా మెప్మా పీడీ తదితరులు పరిశీలించారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి కృష్ణవేణి టాలెంట్ స్కూల్, ద్వితీయ బహుమతి ఎంజేపీటీ సైదాపూర్, తృతీయ బహుమతి జడ్పీహెచ్ఎస్ పెద్దపాపయ్యపల్లి విద్యార్థులు అందుకున్నారు. అనంతరం మున్సిపల్ పారిశుధ్య విభాగంతో విశేష సేవలందించిన కార్మికులు లక్ష్మి, రేణుక, అంజయ్య, కుమార్‌లను శాలువాతో సత్కరించి, షీల్డ్‌లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీఐ వేణు, డీఈవో జనార్దన్‌రావు, ఎంఈవో శ్రీనివాస్, అనురాధ, స్కూల్ అసిస్టెంట్ ఆవుల పద్మశ్రీ, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

తివమ్మాపూర్/గన్నేరువరం, ఏప్రిల్ 19, (ఆంధ్రజ్యోతి): హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పిలుపునిచ్చారు. తిమ్మాపూర్, గన్నేరువరంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రజతోత్సవ సభకు సంబంధించిన పోస్టర్‌ను రసమయి బాలకిషన్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, ఉల్లేంగుల ఏకానందం, మండల అధ్యక్షుడు రావుల రమేష్, మాజీ జడ్పీటీసీ ఎం రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

చొప్పదండి: బీఆర్ఎస్ రజోత్సవ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. శనివారం పట్టణంలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల అధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు లోక రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ చిలుక రవీందర్, మాజీ జడ్పీటీసీలు ఇప్పనపల్లి సాంబయ్య, మాచర్ల సౌజన్య, వెల్మ నాగిరెడ్డి, గన్ను శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైన్స్‌లో చోరీ

శంకరపట్నం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కేశవపట్నం శివారులోని సైదాపూర్‌కు వెళ్లే దారిలో ఉన్న ఓ వైన్స్‌లో శుక్రవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. శుక్రవారం అర్ధరాత్రి పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా వైన్స్ వద్ద లైట్లు వేసి ఉండడంతో అటుగా వెళ్లి చూశారు. వైన్స్ షెటర్ కొంత భాగం లేపి ఉండడంతో పెట్రోలింగ్ పోలీసులు వైన్స్ నిర్వాహకులకు ఫోన్ చేశారు. అక్కడికి చేరుకున్న ఓనర్ ఓపెన్ చేసి చూడగా రూ. 15వేలు నగదు, రూ. 10వేల విలువ చేసే మద్యం పోయినట్లు గుర్తించారు. అంతేకాకుండా సీసీ కెమెరాలు ధ్వంసం చేసి డీవీఆర్ బాక్స్ ఎత్తుకెళ్లినట్లు నిర్వాహకులు తెలిపారు.

'శ్రీ ప్రగతి'లో వార్షికోత్సవం



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే సత్యం

రామడుగు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాల్‌రావుపేట శ్రీ ప్రగతి హైస్కూల్‌లో శనివారం సాయంత్రం వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రాధాకృష్ణ, డైరెక్టర్లు మునీందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, భూమయ్య, శ్రీనివాస్, ఆనంద్ పాల్గొన్నారు.

సీపీఐ నగర కమిటీ ఎన్నిక

భగత్‌నగర్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): భారత కమ్యునిస్టు పార్టీ (సీపీఐ) కరీంనగర్ నగర కమిటీని శుక్రవారం ఎన్నుకున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, సహాయ కార్యదర్శులుగా పైడిపల్లి రాజు, న్యాలపట్ల రాజు, కోశాధికారిగా బీర్ల పద్మతో పాటు 11 మంది కార్యవర్గ సభ్యులు, 29 మంది కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు.

సంక్షిప్త సమాచారం

గంగాధర: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నామని ఎంఈవో ప్రభాకర్‌రావు అన్నారు. శనివారం గంగాధర మండలం ఒద్యారంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు.

- తమ కాలనీకి దారి ఇప్పించాలని గంగాధర మండలం కాసారం గ్రామానికి చెందిన దళితులు ఎంపీవో జనార్దన్‌రెడ్డికి శనివారం వినతిపత్రం అందించారు.

వీణవంక: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిని ఓ టీవీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని మండల యూత్ కాంగ్రెస్ నాయకులు మాదసి సునీల్, మందా అనిల్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రామడుగు: బీజేపీ శ్రేణులు స్థానిక ఎన్నికలే లక్ష్యంగా పనిచేయాలని బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు మోడీ రవీందర్ అన్నారు. వెదిరలో బూత్ కమిటీ అధ్యక్షుల ను నియమించారు.